క్లుప్తంగా

రైల్వేస్టేషన్ ఏర్పాటు కోసం సంతకాల సేకరణ

ఎడపల్లి(బోధన్): మండలంలో రైల్వేస్టేషన్ ఏర్పాటు కోసం జంలం గ్రామంలో శుక్రవారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు గుమ్ముల గంగాధర్ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే అధికారులు స్పందించి ప్రయాణికుల అవసరాల నిమిత్తం స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

మెరుగైన సేవలు అందించాలి



ఆర్మూర్‌టౌన్: ప్రతిఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని పీవోడీటీటీ జిల్లా శిక్షణ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం సమీకృత ప్రాథమిక ఆరోగ్య సేవల్లో భాగంగా ఏఎన్‌ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోరు, కంటి, ఈఎన్‌టీ, వృద్ధాప్యంలో వచ్చే సమస్యలను పరిష్కరించి, వారికి వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ పర్యవేక్షకుడు కృష్ణమూర్తి, సీహెచ్‌వో సాయి, ఎస్‌యూవో ప్రేమలత, నాగమణి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

రెంజల్ (బోధన్): మండలంలోని దూపల్లి హైస్కూల్లో శుక్రవారం ఎంఈవో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'డబుల్' దరఖాస్తుల సర్వే చేపట్టాలి

ఆర్మూర్‌టౌన్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను శనివారం ఇంటింటికీ తిరుగుతూ సర్వే నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినిత పవన్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. సర్వే ఏవిధంగా నిర్వహించాలో తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్ అధికారులకు సూచించారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

వేల్పూర్: కోటగిరి మండల కేంద్రంలోని హైస్కూలు తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వేల్పూర్ మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం స్థానిక తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌పై జరిగిన దాడి సరికాదని పీఆర్టీయూ(టీఎస్)మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగరాజు, కృష్ణమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని సీహెచ్ కొండూర్ గ్రామంలో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత ద్వారా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.. గ్రామంలోని యువకులు ఎలాంటి మాదక ద్రవ్యాలకు బానిస కాకుండ మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలను వివరించారు. అత్యవసర సమయంలో డయల్ 100ను ఉపయోగించుకోవాలన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో జిల్లా జూనియర్ మెన్ హ్యాండ్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా హ్యాండ్‌బాల్ హడక్ కమిటి చైర్మన్ గంగామోహన్‌చక్రు మాట్లాడుతూ.. ఈనెల 7, 8, 9 తేదీలలో ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అంతకుముందు క్రీడాకారులకు క్రీడా దుస్తులను అప్పల గణేష్ అందజేశారు.

మన ఊరు- మన బడి పనుల పరిశీలన

బోధన్‌టౌన్(బోధన్): మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈ శివానందం, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- స్కీం వర్కర్ల డిమాండ్
- పలు మండలాల్లో వర్కర్ల నిరసన

బోధన్/రుద్రూర్/వర్ని/మోర్తాడ్/నందిపేట్/నవీపేట/ఆర్మూర్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని స్కీం వర్కర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీంవర్కర్లు నిరసనలు చేపట్టారు. బోధన్‌లో ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయ ఏవో ముంతాజుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. స్కీంవర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస నెలసరి వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రుద్రూర్, వర్ని,



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, స్కీంవర్కర్లు

మోర్తాడ్, ఆర్మూర్, నందిపేట్, నవీపేట, ఆర్మూర్ తదితర మండలాల్లో తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆశా, ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.



రుద్రూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది..



వర్ని మండల కేంద్రంలో..



ఆర్మూర్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



మోర్తాడ్ మండల కేంద్రంలో..



నందిపేట్ మండల కేంద్రంలో..



నవీపేట్ మండల కేంద్రంలో..

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

బోధన్: బోధన్‌ను ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 19వ రోజు కొనసాగాయి. దీక్షలో న్యాయవాదులు కులకర్ణి దత్తాత్రిరావు, పల్లె శంకర్, విద్యార్థి జేఏసీ నాయకుడు శివకుమార్‌లు కూర్చున్నారు. న్యాయవాదులు, వామపక్ష కార్మిక సంఘాల డివిజన్ ప్రతినిధులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీబావం తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నిజామాబాద్ కలెక్టరేట్‌కు వెళ్లిన న్యాయవాది గణపతి, కోర్టు బేయిలీఫ్, సహాయకుడిపై కేసు నమోదు చేయడంతో నిరసనగా శుక్రవారం బోధన్ కోర్టులో



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ కోశాధికారి శంకర్ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించి విధుల బహిష్కరణకు తీర్మానించామని న్యాయవాదులు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



బాల్కొండ: మెండోరా మండల పరిధిలోని పలు గ్రామాల లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ సుకన్య, జెడ్పీటీసీ తలారి గంగాధర్ పంపిణీ చేశారు. తహసీల్దార్ సతీస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సరస్వతి, కోఆప్షన్ సభ్యుడు బాబా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి



బాల్కొండ: సరస్వతీమాతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రెంజర్ల రాజేశ్‌పై వెంటనే పీడీయాక్టు నమోదు చేయాలని బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో స్థానిక దుర్గామాత కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హిందూ దేవీదేవతలను తిట్టడమే పనిగా పెట్టుకున్న నాస్తికుడిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కమిటీ అధ్యక్షుడు చెలిమెల సాయన్న, సభ్యులు పాల్గొన్నారు.

క్వింటాలుకు రూ.5వేలు ఇవ్వాలి

బాల్కొండ: సజ్జ పంట ధర క్వింటాలుకు రూ.5 వేలు ఇవ్వాలని, అంతకంటే తక్కువ ఉంటే పంటను సాగు చేయమని మెండోరా మండల కేంద్ర రైతులు శుక్రవారం తీర్మాణం చేసుకున్నారు. సజ్జ వాణిజ్య పంట కావడంతో వ్యాపారులే విత్తనాలను సరఫరా చేస్తారు. బైబ్యాక్ ఒప్పందం చేసుకుంటారు. దీంతో తమకు తక్కువ ధర ఇస్తే పంటను సాగు చేయామని రైతులు పేర్కొంటున్నారు.

మొరం తవ్వకాలు నిలిపివేయాలి

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో మొరం తవ్వకాలను నిలిపివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్ డిమాండ్ చేశారు. మాణిక్‌బండార్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్లకు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా మొరం తవ్వుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి పచ్చని చెట్లను, గుట్టలను నాశనం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్



మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు అబ్బన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు శివరాజ్, లచ్చన్న, పోతన్న, సుమన్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం క్షేమం

ఆర్మూర్‌టౌన్: ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించడం కన్నా ఆర్టీసీ బస్సులో ప్రయాణం క్షేమమని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఉషాదేవి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆమె సందర్శించారు. రానున్న సంకాంత్రి సెలవుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సులను సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే ఆర్టీసీ ఎండీ అదేశాల మేరకు ఆర్టీసీ డీపోల్లో అదాయం పెంచుకునేవిధంగా, ఖర్చులు తగ్గించేందుకు ఎటువంటి చర్యలు తీసుకో



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్ఎం ఉషాదేవి

వాలో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ గ్యారేజ్‌లో బస్సుల మరమ్మతులను పరిశీలించారు. డిపో మేనేజర్ కవితా ఉన్నారు.

బడులకు ఎక్స్‌లెన్స్ అవార్డు

బోధన్/ఆర్మూర్‌టౌన్/భీమ్‌గల్: బోధన్‌లోని ఇందూర్ హైస్కూల్, రాకాసీపేట్ ప్రాంతంలోని క్రిసెంట్ హైస్కూల్‌కు అరుదైన స్కూల్ ఎక్స్‌లెన్స్ జాతీయ స్థాయి అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో గురువారం బ్రెయిన్ ఫీడ్ సంస్థ 10వ నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పాఠశాలలకు వారు అవార్డులు అందజేశారు. ఈమేరకు ఇందూర్ హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్,క్రిసెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ జావిద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే భీమ్‌గల్ మండలంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు, ఆర్మూర్‌లోని స్మైల్ పాఠశాలకు అవార్డు వచ్చినట్లు పాఠశాల కరస్పాండెంట్లు షఫీ, రఫిగోహర్ తెలిపారు.

ఎడపల్లి డాక్టర్‌గా వినీత్ రెడ్డి

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా వినీత్‌రెడ్డి శుక్రవారం నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ డాక్టర్‌గా పనిచేసిన రాజ్‌కుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో వినీత్ రెడ్డిని నియమితులయ్యారు. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు .

ఆర్మూర్‌లో ఫిజియోథెరపీ

ఆర్మూర్: పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రంలో శుక్రవారం ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. వైద్యురాలు రేణుక దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్స నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

సమాచారం..

దరఖాస్తుల గడువు పొడగింపు

వర్ని: మైనార్టీ కార్పొరేషన్‌లో రుణాలు పొందేందుకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఎంపీడీవో బషీరుద్దీన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. మైనార్టీ కార్పొరేషన్‌లో రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో ఈనెల 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకొని, ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

10న వాహనాల వేలం

భీమ్‌గల్: పలు నేరాలలో పట్టుబడిన వాహనాలకు ఈనెల 10న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు అబ్కారి శాఖ సీఐ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు కార్యాలయంలో వాహనాలను ముందుగా పరిశీలించవచ్చన్నారు.

బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- వీసీలో అధికారులకు ఆదేశం

సుభాష్‌నగర్: మన ఊరు – మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు పూర్తయిన వెంటనే బిల్లుల చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత ఏఈలను ఆదేశించారు. శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మన ఊరు – మన బడి, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, హరిత హారం, పల్లె ప్రకతి, మినీ బృహత్ పల్లె ప్రకృతి వనాలు, పారిశుద్ధ్యం నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిధులు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో పనులు చేసిన ఏజెన్సీలకు బిల్లులు చెల్లించడంలో ఎందుకు ఆలస్యం అవుతోందని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే బుధవారం నాటికి పరిస్థితిలో మార్పు రావాలని, పద్దతి మార్చుకోని వారిపై సస్పెన్షన్ వేటు వేస్తామని హెచ్చరించారు. బృహత్, మినీ బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్వహణను క్రమం తప్పకుండ పర్యవేక్షణ చేయాలని డీఆర్డీఓను ఆదేశించారు. జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో జయసుధ, మెప్మా పీడీ రాములు, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ రావు, జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు దేవిదాస్, భావన్న, మురళి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అర్బన్ పార్క్ పనుల పరిశీలన

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారు చిన్నాపూర్ అడవిలో రూపుదిద్దుకుంటున్న అర్బన్ పార్కు పనులను శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతున్నాయంటూ సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే సీఎం అర్బన్ పార్కును ప్రారంభించటానికి విచ్చేస్తున్నట్టు తెలిపారు. అర్బన్ పార్క్ పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. రాంచంద్రాపల్లి శివారులో నాట్లు వేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి మంచి చెడులు అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జిల్లా అటవిశాఖ అధికారి వికాస్‌మీనా పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): అంకాపూర్ గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ప్లాంటేషన్ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ కిషోర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అన్ని కుల సంఘాలకు భవనాలు నిర్మిస్తాం

వర్ని: అన్ని కుల సంఘాలకు భవనాలను నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమని నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. మండలంలోని పాత వర్ని గ్రామంలో శుక్రవారం ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడుగు, బలహీన, నిరుపేద ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉండి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా సహకార బ్యాంకు వర్ని శాఖను డీసీసీబీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి పరిశీలించారు. వర్ని శాఖ భవనం శిథిలావస్థకు చేరుకుందని మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని మేనేజర్ భాస్కర్ రెడ్డిని కోరారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్, జాకోర సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పాత వర్ని సర్పంచ్ వెంబడి పద్మ నాగభూషణం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్లాల్ గిరి, ఏజాజ్ ఉన్నారు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీబీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి

వర్చువల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

పెర్కిట్(ఆర్మూర్): వర్చువల్ ద్వారా నిర్వహించే నియోజకవర్గ బూత్ స్థాయి మహా సమ్మేళనంలో ప్రతి కార్యకర్త పాల్గొని, జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య అన్నారు. పెర్కిట్‌లోని ఎమ్మార్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఆయన బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ బూత్ మహా సమ్మేళనంలో ఎంపీ అర్వింద్ పాల్గొంటారని తెలిపారు. ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్‌కుమార్, మందుల బాలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బస్వా లక్ష్మీ నర్సయ్య

మహిళల ప్రతిభకు గుర్తింపు దక్కాలి

బోధన్: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని, వారి ప్రతిభకు తగిన గుర్తింపు దక్కాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోదావరి, సంధ్యారాణి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని తట్టికోట రెడ్డికా కాపు సంఘం భవనంలో శుక్రవారం మహిళలకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. సంఘం పట్టణ అధ్యక్షురాలు నాగమణి, ప్రజా సంఘాల నాయకులున్నారు.



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

ఆధ్యాత్మికం..

దర్గాలో ట్రైనీ కలెక్టర్ పూజలు



వర్ని: మండలంలోని బడా పహాడ్ దర్గాను శుక్రవారం ట్రైనీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సందర్శించారు. శిక్షణలో భాగంగా చుట్టుపక్కల జిల్లాల్లో ఉన్న దేవాలయాలు, అటవీ ప్రాంతాలు, ఆర్థిక వనరులు ఇతర వాటిపై అవగాహన పెంచుకునేందుకు ఆయా ప్రాంతాలను సందర్శిస్తున్నట్లు వెల్లడించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త భజన మండలి సభ్యుల భక్తిపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం తీర్థప్రసాదాలతో అన్నదాన ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు నవీపేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు అర్జున్(10వతరగతి), జగదీష్(9వ తరగతి) ఎంపికయ్యారు. వీరు ఈ నెల 6 నుంచి 8వరకు ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొననున్నారు. ఈసందర్భంగా ఎంఈఓ గణేష్‌రావు, హెచ్‌ఎం అనురాధ, పీడీ డాక్టర్ అబ్బాపూర్ రవిలు విద్యార్థులను అభినందించారు.



సంక్షిప్తం

అంకాపూర్‌లో కంటి వైద్యశిబిరం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని భార్గవి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు డాక్టర్ నరేష్‌కుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు, పెన్నులను పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రుద్రూర్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఎంఈవో శాంతకుమారి ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, నగేష్, సీఆర్పీ అంబర్‌సింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

నందిపేట్(ఆర్మూర్): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఎంపీపీ వాకిడీ సంతోష్‌రెడ్డి ఆవిష్కరించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, ప్రతినిధులు ఉన్నారు.

బాధితునికి ఎంపీ అర్వింద్ చేయూత



మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు మేకల బాల్‌రాజ్ కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో శుక్రవారం బాధితుడికి ఎంపీ అర్వింద్ తన ఫౌండేషన్ నుంచి రూ. 20,000 చెక్కును అందజేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బోధన్: బిలోలి తాలూకా గంజ్‌గావ్ గ్రామంలో శుక్రవారం అమ్మా నాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు వాసుబాబు (శ్రీనివాస్‌రావు), ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన స్వాములు

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని సాలూర గ్రామంలో శుక్రవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయలుదేరారు. అంతకుముందు వారు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

రెంజల్ (బోధన్): మండలంలోని బోర్గా మాజీ సర్పంచ్ లక్ష్మణ్ పటేల్ గురువారం రాత్రి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పలు పార్టీలు చెందిన సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సర్వే చేసి భూమి ఇప్పించండి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని పసుపువాగు సమీపంలో 39 గంటల భూమి కలదని, సర్వే నిర్వహించి కబ్జాకు గురైన తన భూమి ఇప్పించాలని మాజీ కౌన్సిలర్ అలీమొద్దీన్ అధికారులను కోరారు. బోధన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు స్పందించి సర్వే చేపట్టాలన్నారు.